


# బతుకు చిత్రం

- యస్.డి.వి.అజీజ్

ఉగాది పోటీలో ఎంపికైన కథ

'ఛ'.

మనసులోపల, బయటికి ఎన్నోసార్లు అనుకొన్నాడు నూకరాజు. అతని విసుక్కు కారణం? వారం రోజులుగా గిరాకి లేకపోవడమే! అతనో కారుడ్రైవర్. శవాలను తీసుకెళ్ళే కారు డ్రైవర్. గవర్నమెంట్ హాస్పిటల్ ముందు గోడవారగా బారులు తీసివున్న కార్లలో అతనిదో కారు. వంతుల వారీగా వెళ్ళాలి. కనీసం రోజుకో శవమయినా వెళుతూ వుంటుంది. నెలలో కనీసం రెండుసార్లయినా అతని వంతు వస్తూ వుంటుంది. అతని వంతు వచ్చింది. కాని శవం రాలేదు.

హాస్పిటల్‌లోకి వెళ్ళి అన్ని వార్డులు తిరిగాడు. ఎవరూ, అప్పుడో ఇప్పుడో అన్న దాఖలాలు కనిపించలేదు. విసుగొచ్చింది.

"తొందరగా ఎవరైనా ఒకరు చస్తే బాగుణ్ణు" అనుకొన్నాడు. ప్రభుత్వ డాక్టర్ల నిర్లక్ష్యం తమకు వరప్రసాదం అనుకొనే నూకరాజు తనలోని విసుగు ఎక్కువయ్యేసరికి "ఎవర్నయినా ఒకర్ని తొందరగా చంపడ్రా!" అని మనసులోనే డాక్టర్లను తిట్టుకొన్నాడు.

అతనంతగా విసుగు చెందడానికి కారణం? అతని జీవన భృతి అదే! వారం క్రితం వచ్చిన డబ్బులు నాలుగురోజుల్లోనే ఖర్చయిపోయాయి.

నూకరాజు ఒంటరివాడు. వయసు నలభై దాటింది. చిన్నప్పుడే తండ్రి పోయాడు. ఈడొచ్చేసరికి వున్నతల్లీపోయింది. చదువూ సరిగా అబ్బలేదు. చివరికి ఎలాగో ఓలాగ డ్రైవింగ్ నేర్చుకొని కారుడ్రైవర్ అయ్యాడు. ముందు కొన్నాళ్ళు కొందరు ఆసాముల దగ్గర డ్రైవర్‌గా చేశాడు. శవం దగ్గర కాపలా వుండే స్థితిని, పరిస్థితిని అతను తట్టుకోలేకపోయాడు.

"ఎప్పుడూ ఆసాముల వెంట నీడలా వుండే ఉద్యోగం వద్దు. స్వతంత్రంగా వుండే ఉద్యోగం కావాలి" అనుకొన్నాడు.

ఆసాముల దగ్గర పనిచేయటం మానేశాడు. కొందరు మిత్రుల సలహామేరకు చివరికి శవాలను తీసుకెళ్ళే డ్రైవర్ అయ్యాడు. కారు ఒకరిది. తాను డ్రైవర్. నెలకు మూడునాలుగుసార్లు మాత్రమే స్టీరింగ్ చేత పట్టుకోవటం. మిగతా కాలమంతా తనిష్టం. వచ్చిందాంట్లో కారు ఓనర్‌కు సగం. తనకు సగం. ఇలా కొన్నేళ్ళు జరిగాయి. సొంత కారు వుండటం మంచిది అనుకొన్నాడు. సహ మిత్రులవద్ద వారిద్వారా ఇంకొందరి వద్ద ఓ యాభైవేలు అప్పుచేసి సెకెండ్ హ్యాండ్ కారు కొని శవాల కార్ల పార్కింగ్‌లో తన కారును కూడా పెట్టాడు. వచ్చిందాంట్లో సగం అప్పుకు, సగం తన అవసరాలకు వాడుకొంటూ వచ్చాడు. అప్పు తీరింది. వూపిరి పీల్చుకొన్నాడు. వచ్చిన సంపాదనలో కొంత దాచిపెట్టాలని చూశాడు కాని కుదర్లేదు. ఒంటరి జీవితం. శరీరంనుంచి ఉద్భవించే తీపి నరాల బాధ. పెళ్ళి చేసుకుందామని ప్రయత్నించాడు. ఎందుకో ఎవ్వరూ ముందుకు రాలేదు. అందుకు తను శవాల వాహన చోదకుడు కావడమే కారణం అనుకొన్నాడు. పెళ్ళి కాకపోతేనేం? సుఖించాలి అనుకొన్నాడు. చీకటి బజారుల వెంటపడ్డాడు. దానికితోడు తాగుడు కూడా అలవాటయ్యింది. చేతికి వచ్చే సంపాదన నాలుగురోజుల్లోనే ఖర్చయిపోసాగింది. మళ్ళీ గిరాకి వచ్చేవరకూ మిత్రులవద్ద అప్పులు! అయితే తీసుకున్న అప్పులు, గిరాకి తగిలిన వెంటనే తీర్చేయటం నియమంగా పెట్టుకొన్నందుకు, అతనికి అప్పు ఇచ్చేందుకు ఎవ్వరూ సంకోచించేవారు కాదు.

నూకరాజు నలభై ఏళ్ళ జీవిత ప్రస్థానం ఇది!

* * *

"నూకరాజు."

ఆ పిలుపు విని తలెత్తి చూశాడు. హాస్పటల్లో పనిచేసే వార్డుబోయ్ పెంచలయ్య.

"ఏంటట్టా వున్నావు?"

"వారం రోజులయ్యింది. గిరాకి లేదు. చేతిలో డబ్బులాడ్డంలేదు."

"వారంరోజులకే డీలాపడితే ఎట్లా... ఒక్కోసారి అట్లాగే వుంటుంది పరిస్థితి. ఇందాక క్యాన్సర్ వార్డులోకి వచ్చాను. ఓ పేషెంట్ పోయేటట్టున్నాడు. సాయంకాలమో రేపో, గిరాకి తగులుతుందిలే."

పెంచలయ్య మాటలకు నూకరాజులో ఆనందం చోటుచేసుకొంది.

"పద టీ తాగొద్దాం!" అంటూ పెంచలయ్యను తీసుకుని టీకొట్టువైపు నడిచాడు నూకరాజు.

చావు కబుర్లను మోసుకురావటం పెంచలయ్య వంతయితే, అప్పుడప్పుడూ అతనికి పది, పరకతోపాటు మందు ఇప్పించటం నూకరాజు బాధ్యత.

* * *

సాయంకాలం ఆరయ్యింది. ఎలాంటి చావుకబురు

అందలేదు నూకరాజుకు. పెంచలయ్య డ్యూటీ అయిపోయి వెళ్ళిపోయి వుంటాడు అనుకున్నాడు. తానే క్యాన్సర్ వార్డుకు వెళ్ళాడు. అక్కడున్న నర్సును పలుకరించాడు. కనుసైగతోనే రోగిని చూపించింది నర్సు. అటుకేసి దృష్టిసారించాడు.

ఓ పేషెంట్‌కు ఆక్సిజన్ ఎక్కించి వుంది. అతని ఛాతీ వేగంగా కొట్టుకొంటూ వుంది. పక్కనే నిల్చొని కంట పెడుతోందో యువతి. 'పెళ్ళమై వుంటుంది' అనుకొన్నాడు. ఆమెపైనే దృష్టి నిలిపాడు. ఆమె యవ్వనం, అందం అతన్ని ఆకర్షించాయి.

నర్సును వివరాలు అడిగాడు.

ఆమె తనకు తెలిసింది చెప్పుకొచ్చింది. పల్లెటూరు నుంచి వచ్చిందని పేదవాళ్ళని తెలిసొచ్చింది. వెళ్ళి పలుకరించాలనిపించింది. కాని ధైర్యం చాల్లేదు. మనసులోనే ఓ నిట్టూర్పు విడిచి వార్డునుంచి బయటికి వచ్చాడు. కళ్ళముందు ఆ యువతి రూపం! మనసులో ఆలోచనలు. నరాల తీపి బాధ ఎక్కువయ్యింది. అలవాటుపడ్డ చీకటి బజారుకు వెళ్దామనిపించింది. జేబులో చాలినంతగా డబ్బుల్లేవు.

తీపి బాధను బలవంతంగా అణుచుకొన్నాడు. వైన్ షాపుకెళ్ళి ఓ పెగ్గు మందుకొట్టాడు. మిగిలిన డబ్బుతో భోంచేసి, తాను అద్దెకు తీసుకున్న గదికి వెళ్ళక తన కారులోనే పడుకొన్నాడు. గిరాకి వార్తకోసం.

రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో చావు వార్త చెవిన సోకింది. నిద్ర మత్తు దిగిపోయింది. క్యాన్సర్ వార్డుకు వెళ్ళాడు. ఆక్సిజన్ పెట్టిన వ్యక్తి విగత జీవియై పడున్నాడు. పక్కనున్న యువతి భోరున విలపిస్తూ వుంది. పక్క రోగుల తాలూకు బంధువులు, ఆమెను ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు.

నూకరాజు ఆమె దగ్గరికి వెళ్ళి అడిగాడు.

"ఏ వూరు వెళ్ళాలి?"

ఏడుస్తూనే చెప్పిందాయువతి.

"మూడువేలవుతుంది."

"అంత డబ్బులు నా దగ్గర్లేవు."

"డీజిల్‌కు ఓ వెయ్యి ఇవ్వు! మిగతాది వూరెళ్ళాక ఇవ్వొచ్చు!"

"తెచ్చుకున్న డబ్బంతా మందులకే అయిపోయింది. చిల్లర డబ్బులు తప్ప నా దగ్గరేం లేవు. వూరికి తీసుకెళ్ళాక, మావాళ్ళ దగ్గర అడిగి ఇప్పిస్తా!"

"డీజిల్‌కు డబ్బులు కావాలి కదా!"

"ఏం చేతునయ్యా!" ఏడుస్తూనే బిక్కమొగంవేసి అంది ఆ యువతి.

ఆలోచనలో పడ్డాడు నూకరాజు.

డీజిల్ పోయించుకోవడానికి తన దగ్గర కూడా డబ్బుల్లేవు... తోటి కారు డ్రైవర్ల దగ్గర అప్పడిగితే... పుడుతుంది అర్ధరాత్రయినా సరే! గతంలో తాను చాలా సార్లు అడిగాడు. అలాగే తనను కూడా తోటి డ్రైవర్లు అడిగితే ఇచ్చేవాడు. వారిమధ్య కుదిరిన ఒక విధమైన ఒప్పందం అది.

"సరేనమ్మా... నే వెళ్ళి డీజిల్ పోయించుకుని కారు తెస్తాను..." అంటూ వార్డునుంచి బయటికి వచ్చి అర్ధరాత్రయినా తోటి డ్రైవర్ల ఇళ్ళకెళ్ళి, గిరాకి విషయం చెప్పి డబ్బు పోగేసుకొని, కారుకు డీజిల్



నూకరాజు వంక చూసిందా యువతి. నూకరాజు, వార్డు నైట్ వాచ్‌మెన్ కలిసి శవాన్ని వార్డునుంచి బయటికి తీసుకొచ్చి, కారు డిక్కీలో పడుకోబెట్టారు. నైట్ వాచ్‌మెన్ చెయ్యి చాపాడు. నూకరాజు వంక చూసింది ఆ యువతి. నూకరాజు ఓ యాభై అతని చేతిలో పెట్టి, ఆ యువతిని కారు ఎక్కి కూర్చోమన్నాడు. ఆ యువతి ఎక్కి కూర్చుంది. కారు ముందుకు కదిలింది.

పట్టించుకొని కాన్సర్ వార్డు దగ్గరికి వెళ్ళాడు. వార్డులోకి వెళ్ళబోతుండగా ఓ ఆలోచన అతనిలో తళుక్కుమంది. ఇదే అదునైన సమయం అనుకున్నాడు. కాని ప్రస్తావించటం ఎలా? పరిస్థితి అడ్డం తిరిగితే...? ఏమైనా కాని ప్రయత్నం చెయ్యాలి అని తీర్మానించుకున్నాడు.

నూకరాజును చూసిన నైట్ డ్యూటీ నర్సు, డెత్ సర్టిఫికెట్ ఆ యువతి చేతికిస్తూ అంది. "డ్రైవర్ వచ్చాడు శవాన్ని తీసుకెళ్ళు. శవాన్ని ఎక్కువసేపు బెడ్‌పై వుంచకూడదు. ఆలస్యం అయితే మార్చురీకి పంపుతాము."

నూకరాజు వంక చూసిందా యువతి. నూకరాజు, వార్డు నైట్ వాచ్‌మెన్ కలిసి శవాన్ని వార్డునుంచి బయటికి తీసుకొచ్చి, కారు డిక్కీలో పడుకోబెట్టారు. నైట్ వాచ్‌మెన్ చెయ్యి చాపాడు. నూకరాజు వంక చూసింది ఆ యువతి. నూకరాజు ఓ యాభై అతని చేతిలో పెట్టి, ఆ యువతిని కారు ఎక్కి కూర్చోమన్నాడు. ఆ యువతి ఎక్కి కూర్చుంది. కారు ముందుకు కదిలింది.

కారు నగర శివారు దాటాక, రోడ్డు వారగా కారాపాడు నూకరాజు. తల తిప్పి ఆమెవంక చూశాడు. ఆ వెనక సీట్లో కూర్చొన్న ఆ యువతి కళ్ళు మూసుకుని ఏడుస్తూనే వుంది.

'ఎంత ఏడ్చినా చచ్చినవాళ్ళు బతికి రారు. కళ్ళ నీళ్ళు తుడుచుకో!"

కళ్ళ నీళ్ళు తుడుచుకొంది ఆ యువతి.

"కన్నార్పకుండా ఆమెవంకే చూడ సాగాడు."

ఆమెకు అర్థంకాలేదు. చూపు పక్కకు మరల్చింది.

నూకరాజు మనసు దిటువుచేసుకొంటూ చెప్పాడు.

"నువ్వు నేను... కొద్దిసేపు."

పల్లెటూరిదయినా, చదువురానిదయినా ఆ యువతి నూకరాజు కళ్ళలోని కామవాంఛను పసిగట్టి దిగ్భ్రాంతి చెందింది. ఏంచేయాలో పాలుపోలేదు. ఏదో చెప్పబోతుండగా నూకరాజు అడ్డుకొంటూ చెప్పాడు.

"నువ్వు నా కోరిక తీర్చకపోతే, నిన్ను, నీ భర్త శవాన్ని ఇక్కడే వొదిలేసిపోతాను... ఈ రాత్రి సమయంలో... రోడ్డుపక్కన శవంతో వున్న నిన్ను చూస్తే ఎవరో ఒకరు బలవంతంగా లాక్కుపోతారు. ఏమంటావు?"

ఏమనాలో తెలియని పరిస్థితి.

చాలాసేపు మౌనం వహించింది.

"దిగు కారు..."

కారు దిగిందా యువతి.

కారు డిక్కీ తెరచి, శవాన్ని బయటికి లాగి రోడ్డుపై పడేశాడు. కారు వెనక్కి తిప్పి "ఇప్పుడు నిన్ను ఎవరో ఒకరు ఎత్తుకెళ్ళి మానభంగం చేయటం ఖాయం. ఏం చేద్దాం? నా మాట వినలేదు. అనుభవించు!"అనేసి తిరిగి కారును నగరంవైపు దౌడు తీయించాడు.

రెండ్రోజుల తర్వాత టీకొట్టుదగ్గర కూర్చుని టీ తాగుతూ వుంటే తోటి డ్రైవర్ ఆరోజు దినపత్రికలోని ఓ వార్త చూపించాడు. వార్త పక్కన ఫొటోలు కూడా ప్రచురించబడి వున్నాయి. అందులో తాను కార్లో తీసుకెళ్ళిన యువతి శవం. పక్కన భర్త శవం వుంది. వార్తలో చేతిగాజులు పగులగొట్టుకుని, మింగి ఆత్మహత్య చేసుకున్నట్టుగా వుంది.


ఆ వార్త చదివాక నూకరాజులో ఏదో తెలియని బాధ అలుముకొంది. తుచ్ఛమైన తన కోరిక కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి కారకుడ్నయ్యానే అన్న ఆలోచన అతన్ని కుంగదీసింది. అప్రయత్నంగానే కళ్ళవెంట కన్నీరు ఉబికి వచ్చింది. 'ఈ వృత్తి వద్దు, ఈ బతుకు వద్దు'అనిపించింది.

అలా అనిపించిన తర్వాత రోండ్రోజులకే నూకరాజు అదృశ్యమయ్యాడు. ఎక్కడికి వెళ్ళాడో ఎవరికీ తెలియదు. తెలుసుకోవాలన్న ఆసక్తీ ఎవ్వరికీ లేదు.

★

## మూషిక భక్షణం!

చైనా జనాభాలోనే కాదు, ఎలుకల సంఖ్యలోనూ నంబర్ వన్. ఇక్కడి యాంగ్జీ నది వరద నీటితో పొంగి ప్రవహించడంతో లక్షల సంఖ్యలో ఎలుకలు వరి చేలపైన పడ్డాయి. ఎలుకలు రైతులు వరి చేలు కోసే పనే లేకుండా చేసేసాయి. దాంతో రైతులు బియ్యంపైన ప్రేమ వదిలి పెట్టి ఎలుకలనే భక్షించడం మొదలుపెట్టారట. దెబ్బకు దెబ్బ అంటే ఇదేనేమో!



## 38 నిమిషాల యుద్ధం!

ప్రపంచంలో జరిగిన యుద్ధాలలో అతి తక్కువ కాలంలో ముగిసిన యుద్ధం- ఇంగ్లాండుకు జాంజిబార్‌కు మధ్య జరిగిన యుద్ధం. 1890లో జరిగిన ఆ యుద్ధం 38 నిమిషాలు మాత్రమే. జాంజిబార్ సైన్యాధిపతి ఆ కొద్దిసేపు యుద్ధంలో బ్రిటిష్ వారికి లొంగిపోయాడు. సైన్యంతోపాటు!